క్లుప్తంగా...

ముగిసిన బ్రహ్మోత్సవాలు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. సుప్రభాత సేవ, గోష్ఠి, ఉత్సవాంత స్నపనం, అరవణి కైంకర్యం, శ్రీనివాస గద్యమ్ తదితర పూజా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు నిర్వహించారు.

పిల్లి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్



ఉప్పల్: ఉప్పల్ రింగ్ రోడ్డు కేంద్రీయ విద్యాలయం-1 వైపు కొనసాగుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మించిన పిల్లర్‌లో పిల్లి చిక్కుకుంది. మూడు రోజులుగా అరుస్తున్నా ఎవరికీ వినిపించ లేదు. అంత ఎత్తు ఎక్కి తీసేందుకు ఎవరూ సాహసం చేయలేదు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ట్రాఫిక్ కానిస్టేబుల్ పాండు పిల్లర్లపైకి ఇనుప చువ్వల ద్వారా ఎక్కి పిల్లిని రక్షించారు. దీంతో స్థానికులు, జంతు ప్రేమికులు అతడి సాహసాన్ని అభినందించారు.

రాఖీ పర్వదినానికి సర్వం సిద్ధం



మల్లికార్జునగర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

గౌతంనగర్: రాఖీ పర్వదినానికి మల్కాజిగిరి జోన్ పరిధిలో సర్వం సిద్ధమయ్యాయి. అల్వాల్, వెంకటాపురం, మచ్చబొల్లారం, నేరేడ్‌మెట్, యాప్రాల్, గౌతంనగర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున రాఖీల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 31వ తేదీన జరుపుకునే రాఖీ వేడుకలకు రంగురంగుల రాఖీలు, రుచికరమైన మిఠాయిలు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

కేసీఆర్ మల్లికార్జునగర్ నూతన కమిటీ

కాప్రా: కాప్రా డివిజన్ కేసీఆర్ మల్లికార్జుననగర్ కాలనీ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వాసంశెట్టి రాంబాబు, ఉపాధ్యక్షులు మామిడిపెల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఒంటిద్దు లింగస్వామి, సలహాదారులుగా గడిపె రవి, ప్రభాకర్, అబ్దుల్ ఘని, దొమ్మాటి కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా మామిడి పరుశురామ్, కోశాధికారి రాజు, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, బోసయ్య, శ్రీనివాస్, ప్రవీణ్‌చారి, ఖాసీం, భాషా, కృష్ణనాయక్‌లు ఎన్నికయ్యారు.

హరిత హారంలో అందరూ భాగస్వాములు కావాలి



కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్ పిలుపునిచ్చారు. సాయి భవానీనగర్ కాలనీలో మంగళవారం హరిత హారంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మొక్కలు నాటి పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు తిరుపతిరెడ్డి, వెలు గొండయ్య, రాములుగౌడ్, కృష్ణమాచారి, నిర్మల, లతా, ఆంజనేయులు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణను మోడల్ రాష్ట్రంగా మారుస్తాం



నాగారం మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు శంకుస్థాపనలో మంత్రి మల్లారెడ్డి



కుందన్‌పల్లి పరిధిలో కాల్వను పరిశీలించి, స్థానికులతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం కేసీఆర్, కేటీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సుమారు రూ.70 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 5వ వార్డులోని సత్యనారాయణ ఆలయంలో మండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీలో రహదారుల విస్తరణకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించామన్నారు. పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు, శ్మశానవాటికల అభివృద్ధి, తాగునీటి సరఫరా నిమిత్తం ట్యాంకుల నిర్మాణాలు తదితర పనులను దాదాపు పూర్తి చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణను మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుందన్‌పల్లిలో పర్యటన

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కుందన్‌పల్లిలో రాంకీ డంపింగ్ యార్డు నుంచి వ్యర్థాలు వచ్చే నాలాను మంగళవారం కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సందర్శించారు. సూర్యనారాయణ చెరువు దగ్గర ఉన్న కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని రాంకీ డంపింగ్ యార్డు నుంచి వ్యర్థాలు చెరువులో కలవకుండా తూము ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ ప్రశాంత్‌కు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకటేష్, సుజాత, నానునాయక్, కొత్త సురేఖ, నేతలు శ్రీకాంత్‌గౌడ్, హరిగౌడ్, భాస్కర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాదీకా అమృత్ మహోత్సవం

హాజరైన రాజ్యసభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్య



డాక్టర్ ఎస్పీ భారతిని సన్మానిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్య

గౌతంనగర్: గౌతంనగర్ లయన్స్ క్లబ్, జ్యోతినగర్‌కు చెందిన పెండ్యాల నృత్య భారతి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ కల్చర్ సంయుక్త ఆధ్వర్యంలో జ్యోతినగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం రాత్రి ఆజాదీకా అమృత్ మహోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు, రాజ్యసభ సభ్యులు ఆర్.క్రిష్ణయ్య, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక ఆకాడమి సభ్యురాలు డాక్టర్ లయన్ ఎస్పీ భారతి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ భారతి సేవలను గుర్తించి ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లింగారెడ్డి, రాఘవేంద్రరావు, మనోహర్‌రెడ్డి, కుప్పుస్వామి, జ్యోతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మనోజ్, ప్రొ.సుదర్శన్‌సింగ్ ఉన్నారు.

ఉప్పల్ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలి



ఈటలకు ప్రొఫైల్ అందజేస్తున్న బీజేపీ సీనియర్ నేత ఎనుముల మహేష్‌కుమార్

కుషాయిగూడ: రానున్న ఎన్నికల్లో ఉప్పల్ అసెంబ్లీ నుంచి బీజేపీ తరఫున పోటీచేసే అవకాశం కల్పించాలని కోరుతూ బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌కు బీజేపీ ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నేత ఎనుముల మహేష్ కుమార్ వినతి పత్రం అందజేశారు. బీజేపీ సుదీర్ఘ కాలంగా పనిచేస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కీలకంగా వ్యవహరించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి తన ప్రొఫైల్‌ను అందజేశారు. ఈసారి తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించి తన అభ్యర్థనను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధర్మారెడ్డి, మర్రి మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పర్వేశ్‌సింగ్, సత్యనారాయణ, వినోద్, రమేష్ యాదవ్, కల్లూరి వెంకట్‌రెడ్డి, పవన్, రాకేశ్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు



మల్లికార్జున స్వామి దేవాలయంలో పూజల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

మల్కాజిగిరి: శివపురి కాలనీలోని భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో జరిగిన వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు జీఎన్వీ సతీష్‌కుమార్, మోహన్‌రెడ్డి, రాముయాదవ్, సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు మూర్తి, సోమ శ్రీనివాస్, మోహన్ రెడ్డి, లోకేష్, మల్లికార్జున్, రామ్‌శర్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మేరీ మాత ఉత్సవాల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి

వేడుకగా మేరీ మాత తీరునాళ్ల ఉత్సవాలు

కాప్రా: కాప్రా డివిజన్ వల్లభ్‌నగర్‌లోని మదర్ మేరీస్ చర్చిలో మంగళవారం మేరీ మాత తీరునాళ్ల ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మేరీ మాత ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని వారు కోరారు. కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కంటోన్మెంట్ మాజీ వైస్ ప్రెసిడెంట్ జైప్రకాష్, జీవన్, పాస్టర్లు, స్థానికులు పాల్గొన్నారు.

హిల్‌టాప్ కాలనీలో అభివృద్ధి పనులు



హిల్‌టాప్ కాలనీలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ సునీతయాదవ్

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. డివిజన్ పరిధిలోని హిల్‌టాప్ కాలనీలో రూ.15 లక్షలతో గుట్టపై ఉన్న ఇళ్లకు వెళ్లడానికి మెట్ల నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణ పనుల్లో అలసత్వం వీడి వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, నాయకులు మేకల రాముయాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, హిల్‌టాప్ కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్‌తో ఎన్నో అనర్థాలు



ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. జూనియర్లు, సీనియర్లు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ బుగ్గయ్య, కళాశాల ప్రిన్సిపల్ డా.జి.సునీత, వైస్ ప్రిన్సిపల్ డా.రాజశ్రీ, కన్వీనర్ వి.శ్రీనివాసరావు, మురళీకృష్ణ, తిరుపతయ్య, చంద్రసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ బీజేఆర్ నగర్‌లో రూ.16 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ యూజీడీ, తాగునీటి పైపులైన్లు పూర్తయిన కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, ఉమాపతి, ఆంజనేయులు, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం



వివిధ వేషాధారణలో విద్యార్థులు

బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని పద్యాలు, కవితలు, గేయాలు, నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి హాజరై విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని భాషల్లోకెల్లా తెలుగు భాష మధురమైందని, తొలుత మాతృ భాషయైన తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనిల్ కుమార్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణాలు వేగవంతం



సమావేశంలో తాపీమేస్త్రీలకు బహుమతులను అందజేస్తూ..

మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో రారాజుగా ఎదుగుతున్న వికాట్ గ్రూప్‌నకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణ రాష్ట్రంలో విడుదల చేసింది. ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ ప్రసాద్ తెలిపారు. పీర్జాదిగూడలోని ఎస్ఆర్ ట్రేడర్స్‌లో తాపీమేస్త్రీల సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఇంజినీర్ ప్రసాద్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తి చేయవచ్చని అన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయాన్ని అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారని తెలిపారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ బలం చాలా అధికంగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీలర్ సంపత్‌రెడ్డి, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో చిచ్చరపిడుగు

జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన శ్రీక్రితి



ఉప్పల్: జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో నిర్వహించిన నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉప్పల్‌కు చెందిన శ్రీక్రితి చాతరాజు(8) గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటింది. ఈ నెల 23 నుంచి 27 వరకు జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్‌ను సాధించింది. హబ్సిగూడ శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో మూడవ తరగతి చదువుతున్న ఆ చిన్నారి మనోహర్ అమరజ్యోతిల కుమార్తె. అండర్-9 జూనియర్ లెవెల్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. కోచ్ జాడి సుప్రియ, అవుల రాజనర్సు చిన్నారిని అభినందించారు.

కామాక్షిపురం సమస్యలను పరిష్కరిస్తాం



కామాక్షిపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్‌రావు

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కామాక్షిపురంలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు అన్నారు. మంగళవారం ఆమె కామాక్షిపురంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధి నెంబర్-7, 8లో సీసీ రోడ్డు, సీవరేజ్ పైప్‌లైన్ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. ఇటీవల కొంత మంది కాంగ్రెస్ నేతలు రామంతాపూర్ డివిజన్‌లో అభివృద్ధి శూన్యం అంటూ మాట్లాడుతున్నారని అది అబద్ధం అన్నారు. ఇప్పటికే డివిజన్‌లో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని, ఈ విషయంలో తాము చర్చకు కూడా సిద్ధమే అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శ్వేత, డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, స్థానిక సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సమస్యకు పరిష్కారం చూపుతాం



మేయర్‌ను కలిసిన జేఏసీ ప్రతినిధులు

బోడుప్పల్: బోడుప్పల్ నెలకొన్న వక్ఫ్ బోర్డు సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, చామకూర మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. వక్ఫ్ బోర్డు బాధితుల సంఘం జేఏసీ ప్రతినిధులు మంగళవారం మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డిని కలిసి వారి గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సమస్యతో చాలా కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, ఇదే విషయమై మంత్రి మల్లారెడ్డికి వివరించగా, ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కోర్ కమిటీ మెంబర్స్ ప్రమోద్‌కుమార్, సీతారామరాజు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: అర్హులైన ప్రతి పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. 26వ డివిజన్ వీరారెడ్డి కాలనీకి చెందిన దత్తాత్రికి మంజూరైన రూ.60 వేల చెక్కు, 7వ డివిజన్‌లో ఆంజనేయనగర్ కాలనీలో నివాసం ఉండే ఎం.శైలజకు మంజూరైన మరో రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం వారి కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అవసరమైన వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛ్ పీర్జాదిగూడ లక్ష్యంగా కార్యక్రమాలు



ఐటీసీ బృందంతో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్మ

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమీకృత వ్యర్థాల శుద్ధీకరణ పార్కును మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్మ, ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శివశంక్ బందోపాధ్యాయ, ఐటీసీ బృందం మంగళవారం సమీకృత పార్కును సందర్శించారు. నగర పరిధిలోని ప్రజలందరి సహకారంతో తడి, పొడి చెత్తను వంద శాతం వేరుగా సేకరించడంతో పాటు సేకరించిన తడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువును తయారు చేస్తున్నట్లు చెప్పారు. సమీకృత వ్యర్థాల శుద్ధీకరణ పార్కులో రూ.54 లక్షలతో ఏర్పాటు చేసిన బ్రికెడ్ బెక్కెడ్ మిషన్ పనితీరును వివరించారు. భవిష్యత్‌లో బయోగ్యాస్‌ను కూడా పీర్జాదిగూడ డంపింగ్ యార్డులో ఉత్పత్తి చేసేందు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. చెత్తను ఆదాయ వనరుగా మార్చాలనే ఉద్దేశంతో ఐటీసీ వెల్త్ అవుట్ ఆఫ్ వేస్ట్ అనే కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలు స్వచ్ఛందంగా తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను ఇంటి నుంచే వేరు చేసి అందిస్తుండటం గొప్పపరిణామం అన్నారు. స్వచ్ఛ్ పీర్జాదిగూడ నగర నిర్మాణంలో తమవంతు సహకారం అందిస్తామని ఐటీసీ బృందం అన్నారు. పాలక మండలి కృషిని అభినందించారు. ఉమాకాంత్ చీఫ్ మేనేజర్, సీఎస్ఆర్, ఐటీసీ, సత్యశ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్, సధా పోలేని ప్రాజెక్ట్ మేనేజర్, మూర్తి, చెట్టి రాజు, శ్రీనివాస్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ లిటిల్ ఫ్లవర్‌లో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు భాషోద్యమకర్త గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగ ఆచార్యులు సాగి కమలాకరశర్మ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ జయంతిరెడ్డి, నీలిమ విద్యార్థులు పాల్గొన్నారు.



కమలాకరశర్మకు జ్ఞాపికను అందజేస్తున్న వైస్ ప్రిన్సిపల్ జయంతి

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని కాలనీల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ డీసీ రాజుకు విజ్ఞప్తి చేశారు. ఓల్డ్ నేరెడ్‌మెట్, భగత్‌సింగ్‌నగర్, కృపా అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారని, వాటికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. వినాయక చవితి పర్వదినం, నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించాలని కోరామని, సుమారు రూ.52 లక్షలతో చేపట్టామని డీసీ తెలిపారన్నారు. అనంతరం సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ దీపక్, వీఐ రమేష్ పాల్గొన్నారు.

నియామకం

ఉప్పల్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ కన్వీనర్‌గా నామ శ్రవణ్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యూశాంతినగర్ ఆంజనేయస్వామి ఆలయంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నామ శ్రవణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. శామీర్‌పేట ధర్మారెడ్డి, కన్వీనర్ రెవెల్లి రాజు, మారినేని ఫణిందర్, గౌరిగే కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, బొంగు రమేష్, రావుల బాలకృష్ణ, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

